క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్షలో రోగులకు పరీక్షలు



మహిళకు బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట గ్రామ పంచాయతీ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని పండూరు పీహెచ్‌సీ వైద్యులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సుమారు 200 మంది ఈ శిబిరంలో వైద్య సేవలు పొందారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఇతర వైద్య సేవలను అందించారు. పండూరు పీహెచ్ వైద్యాధికారి ఆయేషా బేగం, నిపుణులు రోగులకు వైద్య సేవలందించిన మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ శిబిరానికి ఏర్పాట్లు, రోగులు, సిబ్బందికి భోజన సదుపాయం కల్పించి పర్యవేక్షించారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

కాకినాడ సిటీ: కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు మంగళవారం నగరంలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో మెయిన్‌రోడ్డు, జ్యోతుల మార్కెట్, పెద్ద మార్కెట్, చిట్టూరి వారి వీధి ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు. వ్యాపార సంస్థల నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్లపై వేయకుండా డస్ట్‌బిన్‌లో మాత్రమే వేయాలని, షాపుల వద్దకు వచ్చే హూపర్ టిప్పర్ వాహనాలకు మాత్రమే చెత్తను అందజేయాలని సూచించారు. మధ్యాహ్నం సమయాల్లో డ్రైనేజీల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్

కాకినాడ రూరల్: కాకినాడ నగరం, గ్రామీణ ప్రాంతంలో విస్తరించి ఉన్న సర్పవరం పోలీసు స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తానని ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వైఆర్‌కే శ్రీనివాస్ పేర్కొన్నారు. బదిలీపై సర్పవరం స్టేషన్‌కు వచ్చిన ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌కు స్టేషన్ ఎస్సై అజయ్ బాబు, ఏఎస్సై నాగేశ్వరరావు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన సర్పవరంలో పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు ఆయన అభినందనలు తెలియజేశారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

కరప: ప్రతి నెల గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ, వైద్యుల సలహాల మేరకు పోషకాహారం తీసుకోవాలని, డివిజనల్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆయన గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, సూచనలిచ్చారు. కరప పీహెచ్‌సీ పరిధిలోని 11 ఆరోగ్య ఉప కేంద్రాల ఏఎన్ఎంలు 30 మంది గర్భిణులను పీహెచ్‌సీకి తీసుకురాగా వైద్యులు శ్రీనివాస్‌నాయక్, అంజలీన్‌లు పీహెచ్‌సీ సిబ్బందితో కలసి గర్భిణులకు రక్తపరీక్షలు, బీపీ, షుగరు పరీక్షలు చేసి పలు సూచనలిచ్చారు. అలాగే వేళంగి పీహెచ్‌సీలో గర్భిణులకు డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ ఈ.సింధూర 15 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు.

దత్తాత్రేయునిగా సీతారామస్వామి

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు దత్తాత్రేయునిగా భక్తులను దర్శనమిచ్చారు. స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

రేబిస్‌తో వ్యక్తి జీజీహెచ్‌లో చేరిక

కాకినాడ క్రైమ్: రేబిస్ సోకిన ఓ వ్యక్తి మంగళవారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌లో చేరాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 34 ఏళ్ల నార్సింగ్ మూడు నెలల క్రితం రగ్గులు విక్రయించేందుకు రాజమహేంద్రవరానికి వచ్చాడు. వీఎల్ పురంలో రోడ్డు పక్కన రగ్గులు విక్రయిస్తూ పక్కనే నివాసానికి అనుకూలంగా ఓ గుడారం ఏర్పాటు చేసుకున్నాడు. కొద్ది రోజుల క్రితం ఓ రోజు భారీ వర్షం కురవగా ఓ వీధి కుక్క నార్సింగ్ నివాసం ఉంటున్న గుడారంలోకి ప్రవేశించింది. దానిని తోలేందుకు ప్రయత్నించే క్రమంలో కుక్క కరవడంతో దాని పంటి గాట్లు పడ్డాయి. దీనిని అప్పట్లో నిర్లక్ష్యం చేశాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం అతడు అస్వస్థతకి గురయ్యాడు. కుటుంబ సభ్యులు జీఎస్ఎల్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు అతనికి రేబిస్ సోకినట్టు గుర్తించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు సిఫార్సు చేశారు. జీజీహెచ్‌లో చేరిన అతడిని పరీక్షించిన వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉందని నిర్ధారించారు. ఘటనపై రాజమహేంద్రవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

స్వయం ఉపాధికి 'ముద్ర'

- ఔత్సాహిక వ్యాపారులకు చేయూత
- అవసరాలకు ఆర్థిక భరోసా
- సెక్యూరిటీ లేకుండా రుణాలు
- రూ.10 లక్షల వరకూ పరిమితి



బాలాజీచెరువు: కరోనా కాలంలో కొందరు ఏళ్లగా చేస్తున్న కొలువులు కోల్పోయి ప్రత్యామ్నాయ ఉపాధి వైపు మళ్లారు. వీరిలో కొందరు భవిష్యత్‌లో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వ్యాపారాలు చేయాలని నిర్ణయించుకున్నారు. తద్వారా సొంతంగా ఉపాధి పొందడమే కాకుండా నలుగురికి ఉపాధి కల్పించవచ్చని యోచించారు. అటువంటి ఉన్నవారికి ఆర్థిక సాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముద్ర పేరుతో వ్యాపార రుణాలు అందిస్తుంది. కాకినాడ అర్బన్‌తో పాటు రూరల్ ప్రాంతాల్లో 35 ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన బ్యాంకు బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటి ద్వారా రుణాలు అందజేస్తున్నారు.

రుణం ఎంత ఇస్తారంటే..

18 నుంచి 55 ఏళ్లలోపు వారికి ఈ రుణాలు ఇస్తారు. ముఖ్యంగా మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తున్నప్పటికీ, రూ.50 వేల నుంచి ఐదు లక్షల వరకూ రుణం అందిస్తారు. ఫుడ్, తయారీ, సేవా, ట్రేడింగ్ వంటి వ్యాపారాలు చేసే వారికి రుణాలు ఇస్తారు. లబ్ధిదారుడు ముందుగా ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసుకోవాలి. అందులో చేయాల్సిన వ్యాపారానికి సంబంధించి వివరాలు, పత్రాలు సమర్పించాలి. దీన్ని బట్టి బ్యాంకర్లు రుణం ఇవ్వాలా.. లేదా.. ఇస్తే ఎంత ఇవ్వాలి అనేది నిర్ణయిస్తారు. వడ్డీరేటు 8.5 నుంచి 9 శాతంగా ఉంటుంది. మారటోరియం గరిష్టంగా 18 నెలలు వరకూ ఉంటుంది.

రుణాల్లో రకాలు ఇలా..

ఆయా బ్యాంకులు ఇచ్చే రకాలను పరిశీలిస్తే శిశు.. 50వేల లోపు, కిషోర్ 50 వేల నుంచి ఐదు లక్షలు, తరుణ్. 5 లక్షల నుంచి 10 లక్షలు అందజేస్తారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి డిసెంబర్ వరకూ 6 నెలల కాలంలో దాదాపు 2 కోట్ల రూపాయలు రుణాలు వాహన, వ్యాపార నిమిత్తం అందజేస్తారు.

వ్యాపారాలకు మంచి వేదిక



ఎటువంటి హామీ లేకుండా వ్యాపారాలు చేయాలనుకునే వారికి ఈ రుణాలు బాగా ఉపయోగపడతాయి. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. యునియన్, ఎస్‌బీఐ, సహకార బ్యాంకులతో పాటు ప్రధాన బ్యాంకులు అన్ని రుణాలు మంజూరు చేస్తాయి. సమీప బ్రాంచ్‌లో ఖాతా కలిగి ఉన్నవారు సంప్రదించి అవసరమైతే వ్యాపార రుణం పొందవచ్చు. బ్యాంకర్లు సంతృప్తి చెంది వారి స్కోర్ బాగుంటే త్వరగా రుణం మంజూరు చేస్తారు.

– చందాల శ్రీవెంకట ప్రసాద్,
లీడ్ బ్యాంక్ మేనేజర్, కాకినాడ

ఆటో రుణం మంజూరు చేశారు



ముద్ర రుణంలో భాగంగా ఆటో కొనుగోలు నిమిత్తం రుణం మంజూరు చేశారు. ఐదేళ్ల కాలపరిమితితో తిరిగి చెల్లించేలా రూ.3.25 లక్షలు రుణం ఎస్‌బీఐ శాఖ అందజేసింది. నిరుద్యోగ యువతకు ఈ పథకం బాగా ఉపయోగపడుతుంది.

– టి.గంగాధర్, కాకినాడ

స్ఫూర్తి ప్రదాత డాక్టర్ అంబేడ్కర్



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ సిటీ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు పిలుపునిచ్చారు. విజయవాడలో ఈనెల 18వ తేదీన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జన్ భాగిదరీ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇతర అధికారులు, ఉద్యోగులతో మంగళవారం అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం పేరుతో ఉన్న ఫ్లెక్సీపై ఉద్యోగులు సంతకాలు చేశారు. అంబేద్కర్ చూపిన బాటలో రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకుంటామని ఉద్యోగులతో కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్ సిటీ ఎస్ఈ ఎం.వెంకటరావు, ఈఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకుడు టీవీ శిరిల్, ఏఈ నాగేశ్వరరావు వివిధ విభాగాధిపతులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

రేపు అమ్మవారికి మహాకుంభాభిషేకం

బోట్‌క్లబ్: స్థానిక ద్వారకానగర్‌లో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం కుంభాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ పల్లాల కృష్ణారెడ్డి మంగళవారం విలేకర్లకు తెలిపారు. అమ్మవారికి ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకూ కుంభాభిషేకం జరుగుతుందన్నారు. 108 బిందెల నీటితో అభిషేకం చేయనున్నట్టు తెలిపారు. భక్తులు స్వయంగా అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలు, పన్నీరు, కొబ్బరినీటితో అభిషేకం చేసుకోవచ్చునన్నారు. అనంతరం ఆగమశాస్త్ర పండితులు చక్రవర్తుల గోపాలకృష్ణమాచారి ఆధ్వర్యంలో లక్ష కుంకుమపూజ చేయడం జరుగుతుందన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ దీక్షలు

కాకినాడ సిటీ: అంగన్‌వాడీల సమ్మె మంగళవారం 29వ రోజు కొనసాగింది. రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. ఈ శిబిరాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, పెద్దాపురం ప్రాజెక్టు కార్యదర్శి దాడి బేబీ, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు నర్ల ఈశ్వరిలు ప్రారంభించారు.

ఏడేళ్లలో రూ.కోటితో సేవా కార్యక్రమాలు



ఉపకార వేతనాలు అందజేస్తున్న రెడ్‌కాన్వెంట్ ట్రస్ట్ పూర్వ విద్యార్థులు

బాలాజీచెరువు: పూర్వ విద్యార్థులందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న రెడ్‌కాన్వెంట్ పూర్వవిద్యార్థుల చారిట్రబుల్ ట్రస్ట్ (1978) ద్వారా ఏడేళ్ల కాలంలో రూ.కోటికి పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. దేవాలయం వీధిలో గల కార్యాలయంలో మంగళవారం ట్రస్ట్ ద్వారా రూ.1.75 లక్షలు విలువైన ఉపకార వేతనాలు అందజేశారు. వీటితో పాటు రైల్వే స్టేషన్‌కు వీల్‌ఛైర్, పేద విద్యార్థికి సైకిల్‌ను రిలయన్స్ జనరల్ మేనేజర్ వేమూరి రామచంద్ర చేతుల మీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి జగన్నాథం, కోశాధికారి కళ్యాణి, రెడ్నం రమణామూర్తి, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో సర్పవరం

- రూ.2.25 కోట్లతో కార్యక్రమాలు
- ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



సర్పవరంలో వాటర్ ట్యాంక్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: కాకినాడను ఆనుకుని అభివృద్ధి చెందుతున్న సర్పవరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గ్రామంలో సుమారు రూ.2.25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, గ్రామ నాయకుడు పుల్ల చందు ఆధ్వర్యంలో జల జీవన్ నిధులు రూ.138.13 కోట్లతో సచివాలయం–1 సమీపంలో, శెట్టి బలిజపేటలో నిర్మించిన రెండు ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రారంభించి, ఇంటింటికీ కుళాయిని ప్రారంభించారు. శివాలయం వీధిలో సుమారు రూ.57.3 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేశారు. రామాలయం వీధిలో రూ.17.2 లక్షలతో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన, ఎస్సీ పేటలో రూ.26 లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు, శెట్టిబలిజ పేటలో రూ.17.5 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, భావన్నారాయణపురంలో రూ.41 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాలకు ఆయన ప్రారంభోత్సవాలు చేశారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టామన్నారు. గ్రామంలో నూతన సచివాలయ భవనంలో అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించి జన్ భాగిదరీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో జెడ్పీటీసీ సురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ గీసాల శ్రీను, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, పుల్ల కోటేశ్వరరావు, పుల్ల చక్రధర్, ఎంపీటీసీలు రాజేష్, సూర్యచంద్ర, శ్రీనివాస్, భావనారాయణస్వామి ఆలయ ఛైర్మన్ పుల్ల నారాయణరావు, కొప్పిశెట్టి శివ, గంగాధర్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీదేవి, ఏఈ మారుతీరామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు

ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్



శంకర్‌నాయక్‌ను సత్కరిస్తున్న వీసీ డాక్టర్ ప్రసాదరాజు, డాక్టర్ మాలోతు రమేష్

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజును రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్ ఆయన చాంబర్ మర్యాద పూర్వకంగా కలిసారు. ఎస్సీ ఎస్టీ బ్లాక్‌లాగ్, అలాగే విద్యా విధానం తదితర విషయాలపై చర్చించారు. గిరిజన సమస్యలపై అధ్యయనం చేయడంతో పాటు వారి సమస్యలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వివరించి పరిష్కారించేందుకు తాను పర్యటిస్తున్నానని, తనపై నమ్మకంతో సభ్యునిగా నియమించిన జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. జగన్ మోహన్‌రెడ్డి హయాంలో విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు కలిగాయన్నారు. అనంతరం వీసీ ప్రసాదరాజు కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్‌ను సత్కరించారు. ఆయన వెంట ఫుడ్‌టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి విజయశాంతి ఉన్నారు. అనంతరం వర్సిటీ అతిథి గృహంలో గిరిజన సంక్షేమ శాఖాధికారులతో సమావేశమై హాస్టళ్లు, విద్యార్థులకు అందిస్తున్న సేవలు తదితర వాటిపై సమీక్షించారు. గిరిజన ప్రాంతాలకు చెందిన పలువురు ఆయా ప్రాంతంలో ఉన్న సమస్యలు వివరించి పర్యటించాలని కోరారు. అనంతరం ప్రత్తిపాడు మండల గిరిజన ప్రాంత సందర్శనకు వెళ్లారు.

సుస్థిర ప్రణాళికా లక్ష్యాలు సాధించాలి

- జెడ్పీ సీఈఓ రమణారెడ్డి
- జిల్లా అధికారులకు శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న మండల, పంచాయతీ అధికారులతో జెడ్పీ సీఈవో రమణారెడ్డి

కాకినాడ సిటీ: జిల్లాలో గల లైన్ డిపార్టుమెంట్ జిల్లా అధికారులకు గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లకు సంబంధించి సుస్థిర ప్రణాళికా లక్ష్యాల రూపకల్పనపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి మండలాల్లో బ్లాక్ లెవెల్ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు, ప్రతి గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 9 అంశాలలో ఏదైనా అంశంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధించేందుకు అధికారులు ప్రయత్నాలు చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో లక్ష్యసాధనకు ప్రతి ఒక్క అధికారి సంకల్పం తీసుకోవాలని సీఈవో కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా, రంపచోడవరం డివిజన్ పరిధిలోని మండల అభివృద్ధి అధికారులు, విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్, డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీపీవో కె.భారతీ సౌజన్య, సామర్లకోట విస్తర్ణ శిక్షణాకేంద్రం ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ తదితరులు పాల్గొని శిక్షణ ఇచ్చారు.

పల్లెలకు ముందస్తు పండగ

- వేడుకగా జగనన్న సంక్రాంతి సంబరాలు
- పర్యవేక్షించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



నడకుదురులో రంగవల్లులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



ఉప్పలంకలో మ్యూజికల్‌చైర్స్ ఆడుతున్న మహిళలు



గురజనాపల్లిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

కరప: గ్రామ గ్రామాన జగనన్న సంక్రాంతి సంబరాల సందడితో నాలుగు రోజులు ముందరే పండగ వాతావరణం కనిపిస్తోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నడకుదురులో మంగళవారం మహిళలకు నిర్వహించిన జగనన్న సంక్రాంతి సంబరాల సందర్భంగా ఏర్పాటుచేసిన రంగవల్లులు, మ్యూజికల్ చైర్స్, స్పూన్ అండ్ లెమన్ పోటీలను ఆయన తిలకించి మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన సంక్రాంతి శోభ కనిపిస్తోందన్నారు. ప్రజలందరూ ఆనందంగా సంక్రాంతిని జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజేతలకు ఎమ్మెల్యే కన్నబాబు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, సర్పంచ్ డేగల లలితకుమారి తదితర నాయకులతో కలసి బహుమతులు అందజేశారు. మొదటి రోజు నడకుదురు, పెనుగుదురు, ఉప్పలంక, గురజనాపల్లి, కొరిపల్లి, జెడ్.భావారం, అరట్లకట్ట, పాతర్లగడ్డ గ్రామాల్లో మహిళలకు జగనన్న సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశాలతో గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న సంక్రాంతి సంబరాలను ఎంఈఓ ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, కె.బుల్లికృష్ణవేణి, పీడీలు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆటల పోటీలను పర్యవేక్షించి విజేతలను నిర్ణయించారు. ఎమ్మెల్యే కన్నబాబు సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన బహుమతులను ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు కలసి విజేతలకు అందజేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు నందిబాబు

ఆకట్టుకున్న ముగ్గులు

కాకినాడరూరల్: స్థానిక రమణ్యపేట పద్మానగర్ కాలనీలో మంగళవారం రాత్రి రంగవల్లు పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సందర్భంగా కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల ఈ పోటీలు నిర్వహించారు. అనంతరం కాలనీలోని ఐదు వీధుల్లో ప్రథమ, ద్వితీయ స్థాయిలో నిలిచిన ముగ్గులను ఎంపిక చేశారు. అయోధ్య రామాలయంతో కూడిన ముగ్గును వి.నాగలక్ష్మి వేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విజేతలకు పద్మానగర్ పార్కు వద్ద బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇంటి నందిబాబు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా నవరత్నాలు

- ఎమ్మెల్యే కన్నబాబు
- వేళంగిలో గడప గడపకూ మనప్రభుత్వం



వేళంగిలో స్థానిక నాయకులతో కలసి మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం కల్పించి, తద్వారా ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని చెప్పేందుకే సీఎం జగన్ ఆదేశాల మేరకు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా మంగళవారం ఆయన స్థానిక నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి వేళంగిలో ఇంటింటికీ తిరిగి సీఎం జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఎవరికి ఏయే పథకాల ద్వారా ఎంతమేర లబ్ధి పొందారో వివరించారు. వేళంగి సర్పంచ్ సవిలే సీలిమ, ఉప సర్పంచ్ కుంచే అయ్యన్న, పార్టీ నాయకులు గరగ జెమ్మీ, సవిలే రాజేష్, సానా శ్రీను, జీలకర్ర దుర్గారావు, జవ్వాది రాంబాబు తదితరులు ఎమ్మెల్యే కన్నబాబును ఇంటింటికీ తీసుకెళ్లగా సంక్షేమ పథకాలను వివరించి, అర్హత ఉండి ఎవరికైనా ఏ పథకం రాకపోయినా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా జల్ జీవన్ మిషన్ పథకం నిధులు రూ 92.7 లక్షలతో నిర్మించిన వాటర్‌ట్యాంక్, ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రగతికి, ప్రజా సంక్షేమానికి పనిచేస్తున్నారని, అటువంటి నాయకుడిని వచ్చే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే కన్నబాబు కోరారు. ముందుగా రామాలయంలో పూజలు, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఎమ్మెల్యే కన్నబాబు నివాళులర్పించారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఫ్లెక్సీపై ఎమ్మెల్యే సంతకం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, వజ్రపు కామేశ్వరరావు, మార్రెళ్ల వెంకటరమణ, నున్న వీరబాబు, చింతా బుజ్జి, ఎంపీడీఓ కె.అప్పారావు, కార్యదర్శి పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందే..

కాకినాడ సిటీ: రానున్న ఎన్నికల్లో బీసీలకు సరైన ప్రాధాన్యం ఇవ్వకపోతే ఆయా పార్టీలకు సరైన బుద్ధి చెప్పేందుకు బీసీ సామాజిక వర్గాలు సిద్ధంగా ఉన్నాయని బీసీ, ఎస్సీ ఐక్య జేఏసీ జిల్లా నాయకులు చొల్లంగి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం కాకినాడ శెట్టిబలిజ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఒకే కులం ప్రాతినిధ్యం కొనసాగుతుందని, ఇంక ఏ కులానికి రాజకీయ పార్టీలు విలువ ఇవ్వకుండా వారి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. గ్రామస్థాయి పార్టీ పదవుల నుంచి ఎమ్మెల్యే, ఎంపీ స్థాయి వరకు ఒకే కులం తప్ప బీసీలకు రాజకీయ పార్టీలకు కనిపించడం లేదన్నారు. వీరిని ఓటు బ్యాంకుగా వాడుకోవడం తప్ప గౌరవ మర్యాద లేవన్నారు. జిల్లాలో 12 లక్షల మంది బీసీ, ఎస్సీలు ఉన్నా ఎటువంటి ప్రాధాన్యం లేదన్నారు. సమావేశంలో పితాని నూకరాజు, చొల్లంగి శ్రీనివాస్, చింతాకుల శ్రీనివాస్, అంగటి అంజిబాబు పాల్గొన్నారు.